
# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | శుక్రవారం 15 నవంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 157

తెలుగు దినపత్రిక


## వేములవాడ రాజన్న ఆలయానికి మాస్టర్ ప్లాన్



- నిధుల కోసం సీఎం, డిప్యూటీ సీఎంతో చర్చిస్తాం
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వేములవాడ అభివృద్ధిపై మంత్రి పొన్నం,
- విప్ ఆది శ్రీనివాస్ తో సమీక్ష

..........వివరాలు 3లో



## పనులే.. పబ్లిసిటీ..

- విజయోత్సవాలపై సీఎం సమీక్ష..
- షెడ్యూల్ వివరించిన అధికారులు..
- నెల రోజుల పాటు కార్యక్రమాలు..
- సర్కార్ పాలసీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి పిలుపు..

**జనపదం, హైదరాబాద్ సిటీ:**

ప్రజాపాలన-విజయోత్సవాలపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలపై చేపట్టే కార్యక్రమాలను ఈ సందర్భంగా సీఎంకు అధికారులు వివరించారు. ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా సీఎం వారికి సూచించారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా వరంగల్, కరీంనగర్, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఏర్పాటు చేసే బహిరంగసభల్లో సీఎం పాల్గొంటారు.

**పథకాల పబ్లిసిటీపై..**

మహిళల సాధికారత, రైతుల సంక్షేమం, యూత్ ఎంపవర్ మెంట్ కు సంబంధించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ నెల 19న వరంగల్ వేదికగా 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు సీఎం రేవంత్ ......(తరువాయి 2లో)

# లగచర్ల లడాయి..

## కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ గా దాడి లొల్లి..

- రోజుకో మలుపు తిరుగుతున్న వ్యవహారం..
- పట్నం అరెస్టుతో తీవ్ర ఉత్కంఠ..
- తప్పును తప్పించుకోవడానికి ఇరువురి యత్నం..
- తెలంగాణ భవన్ వెళ్లి గోడు వెల్లబోసుకున్న బాధిత రైతుల కుటుంబీకులు..
- అండగా ఉంటామన్న కేటీఆర్..
- కుట్రదారులు శిక్ష అనుభవించాల్సిందే అంటున్న ప్రభుత్వ పెద్దలు..




లగచర్ల పోరు రోజురోజుకు రగులుకుంటున్నది. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్, రిమాండ్ తో బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. దళితులను థర్డ్ డిగ్రీతో చిత్రహింసలకు గురిచేసి నడవలేకుండా కొట్టిన ఘటనపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నది. జానెడు భూమిని ఇవ్వడానికి ఇష్టపడని రైతులను బలవంత పెడుతూ, భయాందోళనకు గురిచేస్తూ లాక్కునే ప్రయత్నంలో ఇంటలిజెన్స్ వైఫల్యంతో జరిగిన దాడిని బూచీగా చూపుతున్న తీరును ఎండగడుతున్నది. అరెస్టులు ఆపలేవని, అణచివేతలు మరింత ఆందోళనకు దారి తీస్తాయని హెచ్చరిస్తూ రేవంత్ సర్కార్ కు మరిన్ని సవాళ్లు విసురుతున్నది. అన్యాయంగా రైతులను లోపలేయడంతో వారి బంధువులు, కుటుంబ సభ్యులు ఎకాఎకి తెలంగాణ భవన్ కు వెళ్లి మొరపెట్టుకున్న ఘటనతో చలించిన కేటీఆర్ సర్కార్ పై విరుచుపడి తీవ్ర స్వరంతో హెచ్చరికలు ఇవ్వడంతో రాజకీయం మరింత వేడెక్కింది. సవాళ్లు, ప్రతిసవాళ్లతో ఫార్మా విలేజ్ వ్యవహారం కొత్త వివాదాలకు కేంద్రమవుతోంది.

### అంతా కుట్ర..

- నేనెవరి పేరు చెప్పలేదు
- కేటీఆర్ పేరు చెప్పారనడం అబద్ధం
- జైలు నుంచి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అఫిడవిట్
- న్యాయవాది ద్వారా విడుదల చేసిన పట్నం

2



### మా వాళ్లను విపరీతంగా కొట్టారు..

- థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలు పెట్టారు..
- భూమి ఇవ్వం అన్నందుకు అంతు చూస్తరా..
- జరిగిన దారుణాలను చెప్పుకుని కన్నీరు పెట్టుకున్న బాధిత కుటుంబాలు..
- తెలంగాణ భవన్ వరుగులు పెట్టి ఆశ్రయించిన వైనం..
- కేటీఆర్ కు గోడు వెల్లబోసుకున్న మహిళలు..

2

### నువ్వెంత..? నీ లెక్కెంత..?

- మోడే ఏం చేయలేక పోయాడు..?
- నీ ఉడుత ఊపులకు భయపడేటోళ్లు లేరిక్కడ..?
- ఏం చేసుకుంటావో చేసుకో..
- ఎన్ని కేసులైనా పెట్టుకో..
- ఎక్కడున్నా నిన్ను వదిలేది లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మీడియా చిట్ చాట్లో సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు

2



### రాష్ట్రంలో ఎమర్జెన్సీ..

- నాటి పాలనను రేవంత్ మరిపిస్తున్నారు..
- పాలనపై ప్రజా తిరుగు బాటు కొడంగల్ నుండే ప్రారంభం...
- బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇలాగే చేశామా..?
- మల్లన్నసాగర్ సందర్శనకు వెళ్తే రక్షణ కల్పించిన విషయం మరుస్తారా..?
- మాజీ మంత్రి హరీష్ రావు
- చర్లపల్లి జైల్లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో ములాఖత్

2




### కేటీఆర్ చెబితేనే దాడి..

- లగచర్ల ఘటన వెనుక కుట్ర
- రేపటి నుంచి జిల్లాలు పర్యటిస్తా..
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- గాంధీ భవన్ లో మీడియాతో సమావేశం..

2



### సాగుతున్న సర్వే

- ఫ్రిజ్లు, ఏసీలు, కార్లు ఉన్న వారికి భయం
- సంక్షేమ పథకాలు కట్ చేయం
- సర్వే పూర్తి చేసి తీరుతాం
- ప్రతి ఒక్కరి సమాచారం గోప్యం
- బ్యాంకు అకౌంట్ డీటెల్స్ అడుగడం లేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్

4

### లగచర్ల భూములు ముట్టుకుంటే ఊరుకోం

- హైడ్రా పేరుతో బుల్డోజర్ల పాలన నడిపిస్తున్నారు
- ప్రజలకు ఇచ్చిన హామీలు మరిచిపోయారు
- కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే దూకుడుగా పని చేస్తున్నారు
- మావోయిస్టు పార్టీ లేఖ
- సీఎం రేవంత్, ప్రభుత్వానికి వార్నింగ్

4

## రేవంత్ ది మిడిమిడి జ్ఞానం

- గవర్నల్ పై నోరుపారేసుకోవడం సరికాదు..
- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అనడం అవివేకం
- తాము కేవలం ప్రజాపక్షం మాత్రమే..
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్ సిటీ:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిడిమిడి జ్ఞానంతో వ్యవహరిస్తున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా లీగల్ ఒపీనియన్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో కొంత జాప్యం జరిగితే తొందరపాటుగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అంత మాత్రాన బీజేపీ, ......(తరువాయి 2లో)



## ప్రభుత్వాన్ని అస్థిరపర్చే కుట్ర..

- బీఆర్ఎస్ దుష్ట పాలనలో రైతు ఆత్మార్పణ
- రైతులకు సంకెళ్లు... దళితులను తొక్కించిన ఘటనలు మరిచారా?
- లగచర్ల ఘటనలో ఎవరినీ ఉపేక్షించం
- రైతుల సమస్యల పరిష్కారానికి సర్కార్ సిద్ధం..
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**జనపదం, హైదరాబాద్ సిటీ :**

రాష్ట్ర ప్రభుత్వాన్ని, పరిపాలనను అస్థిరపరచాలన్న కుట్ర జరుగుతోందని, అధికారం కోల్పోయామన్న అక్కసుతో అమాయకులైన రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. చిల్లర, అవకాశవాద, కుట్రపూరిత రాజకీయాలతో మనుగడ సాగించలేరనే విషయాన్ని బీఆర్ఎస్ గుర్తించాలని హితవు పలికారు. పార్టీ ఉనికి కోసం అమాయక రైతులను బలిపెట్టవద్దని ఆ పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేశారు. లగచర్ల ......(తరువాయి 2లో)




## దాడి కారకులను శిక్షించాలి

- లగచర్ల ఘటనలో కుట్రదారులపై చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ఉద్యోగుల జేఏసీ ధర్నా




**జనపదం, న్యూస్ నెట్ వర్క్ :**

లగచర్లలో అధికారులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఘటన కుట్ర వెనుక ఎవరున్నా సరే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు గురువారం అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు జరిగాయి. కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కలెక్టరేట్ ముందు జరిగిన ధర్నాలో జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజల కోసం పని చేసే అధికారులను లక్ష్యంగా చేసుకొని దాడి చేయడంలో కుట్ర కోణం దాగి ఉంటుందని ఆరోపించారు. ఇప్పటికే పోలీసుల విచారణలో వెలుగులోకి వస్తున్న విషయాలు ఉద్యోగ లోకాన్ని భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవలు అందించే అధికారులపై దాడులు, ......(తరువాయి 2లో)

# తూచ్...

## సుప్రీంకోర్టు తీర్పా.. మాకు వర్తించదు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు
- జీహెచ్ఎంసీ చట్టం-405 ప్రకారం నోటీసులు అవసరం లేదని వ్యాఖ్య..
- కమిషనర్ మాటలపై సర్వత్రా చర్చ..



**జనపదం, హైదరాబాద్ బ్యూరో:**

బుల్డోజర్లతో కూల్చివేతలపై సుప్రీం కోర్టు తాజాగా కొన్ని కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఆదేశాలు సంచలనంగా మారాయి. అయితే, హైదరాబాద్‌లో అలజడి సృష్టించిన హైడ్రా ప్రస్తుతం కాస్త విరామం తీసుకుంది. ఉత్తరప్రదేశ్ సహా దేశంలోని పలు రాష్ట్రాల్లో బుల్డోజర్ల విధానంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కూల్చివేతలకు 15 రోజుల ముందు నిర్మాణ యజమానికి నోటీసులు ఇవ్వాలంటూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు తమకు వర్తించదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా హైడ్రా కమిషనర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. దేశంలో బుల్డోజింగ్ విధానంపై సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. కేవలం ఆరోపణలతోనే ఏకపక్షంగా పౌరుల ఇళ్లు కూల్చివేయడం రాజ్యాంగ చట్టాన్ని, అధికారాల విభజన సూత్రాన్ని ఉల్లంఘిస్తుందని న్యాయస్థానం వివరించింది. నిందితుల ఇళ్లను బుల్డజర్లతో కూల్చడం సరికాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిందితుల ......(తరువాయి 2లో)

## తిరుపతన్న అడిగితే నెంబర్లు ఇచ్చా..



- ఫోన్ టాపింగ్ కేసులో ముగిసిన లింగయ్య విచారణ
- అంతకు ముందు జూబ్లీహిల్స్ పీఎస్ లో మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు..

3

## బొంతపల్లిలో దారుణ హత్య

- తల్లి కొడుకును హతమర్చిన నిందితుడు
- పాత కక్షలే కారణం
- కేసు విచారణ చేస్తున్న పోలీసులు

3

## అంతా కుట్ర..

- నేనెవరి పేరు చెప్పలేదు
- కేటీఆర్ పేరు చెప్పారనడం అబద్ధం
- జైలు నుంచి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అఫిడవిట్
- న్యాయవాది ద్వారా విడుదల చేసిన పట్నం



**జనపదం, చర్లపల్లి:** తాను పోలీసులకు ఎలాంటి స్టేట్ మెంట్ ఇవ్వలేదని, ఎవరి పేరు చెప్పలేదని వికారాబాద్ జిల్లాలోని లగచర్లలో జరిగిన ఘటనలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు. పోలీసులు తన పేరుతో ఇచ్చిన కన్ఫెషన్ రిపోర్ట్ తప్పు అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురించి కానీ కేసు గురించి కానీ ఎలాంటి స్టేట్ మెంట్ పోలీసులు తన నుంచి తీసుకోలేదని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కోర్టుకు వచ్చాక తన అడ్వొకేట్ అడిగితే రిమాండ్ రిపోర్ట్ ఇచ్చారని అప్పటి వరకు అందులో ఏముందో కూడా తనకు తెలియదని జైలు నుంచి పట్నం తన న్యాయవాది ద్వారా విడుదల చేసిన అఫిడవిట్ లో స్పష్టం చేశారు. జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏదో కుట్ర పన్నుతున్నట్లుగా కనిపిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## రేవంత్‌ది మిడిమిడి జ్ఞానం

**(మొదటిపేజీ తరువాయి)** బీఆర్ఎస్ ఒకటే అని చెప్పడం అవివేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము బీఆర్ఎస్, కాంగ్రెస్ పక్షం కాదని, ప్రజాపక్షమని పేర్కొన్నారు. అవినీతి ఎక్కడ జరిగినా విచారణ జరపాలన్నదే తమ డిమాండ్ అన్నారు. కాళేశ్వరం మీద సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని, సీఎం విచారణ కోరారా...? అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరిస్తున్నాయని తెలిపారు. వైఫల్యాలను, అసమర్థత నుంచి దృష్టి మళ్లించేందుకు రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని తెలిపారు. కేటీఆర్, కేసీఆర్ ఇచ్చే సర్టిఫికెట్లు మాకు అవసరం లేదన్నారు. వారి హయాంలో ప్రధాని మోడీ ప్రాజెక్టులను ప్రారంభించడానికి తెలంగాణకు వస్తే బయటకు రాని కేసీఆర్, కేటీఆర్ కు మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. కలెక్టర్ మీద దాడి తప్పు అని భావిస్తోన్న తరుణంలో గ్రామస్తుల మీద కూడా అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో ఈ ఘటన జరిగిందని, ఆయన తన ప్రజలతో మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు. మహారాష్ట్ర, జార్ఖండ్ లో బీజేపీ అధికారంలోకి రాబోతుందన్నారు. ఒక్క అవినీతి, కుంభకోణం ఆరోపణ లేకుండా బీజేపీ, శివసేన ప్రభుత్వ పాలన సాగిందని కిషన్ రెడ్డి కితాబిచ్చారు.

## ప్రభుత్వాన్ని అస్థిరపర్చే కుట్ర..

**(మొదటిపేజీ తరువాయి)** ఘటనలో ఎవరినీ ఉపేక్షించబోమని, చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్తుందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. లగచర్లలో ప్రజలు, అక్కడి రైతుల సమస్యలు తెలుసుకోవడానికి కలెక్టర్‌తో సహా అధికారులు వెళ్లినపుడు ఎలాంటి చర్చకు ఆస్కారం ఇవ్వకుండానే దాడికి పాల్పడడం నీచం, హేయమైన చర్య అన్నారు. రైతులు సమస్యలను చెప్పుకుంటే వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా ఇలాంటి కుట్రపూరిత చర్యలకు పాల్పడడం దురదృష్టకరం అన్నారు. జిల్లాకు మెజిస్ట్రేట్‌గా ఉన్నకలెక్టర్ పైనే హత్యాయత్నం చేయడానికి కుట్ర పన్నారని, అధికారుల మీద దాడి అనేది మనమీద మనం దాడి చేసుకున్నట్లే అన్నారు. రైతుల ముసుగులో కొంతమంది గులాబీ గూండాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనివెనుక ఎవరున్నారో అందరికీ తెలుసని, కుట్రపూరితంగా అధికారులను రైతులకు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గులాబీ గూండాల కుట్రలను రైతాంగం అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గడచిన 11నెలలుగా ప్రతి విషయంలోనూ ప్రజాస్వామ్య యుతంగా ప్రజల సమస్యలను విని పరిష్కరిస్తున్నామని, బీఆర్ఎస్ పది సంవత్సరాల నియంతృత్వ పాలనలో ఖమ్మం జిల్లాలో మిర్చి రైతులకు బేడీలు వేశారన్నారు. ఇసుక దందాలకు అడ్డువస్తున్నారని సిరిసిల్ల నియోజకవర్గం నేరెళ్లలో దళితులను ట్రాక్టర్‌తో తొక్కించి పోలీసు స్టేషన్‌లో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని గుర్తు చేశారు. నాటి ప్రభుత్వం పెట్టిన హింసను భరించలేక 2021 జూన్ లో వేములఘాట్ గ్రామ రైతు తూటుకూరి మల్లారెడ్డి కూల్చివేసిన తన ఇంటిలోని కట్టెలను పోగుచేసి దానినే చితిగా మార్చుకొని ఆత్మార్పణ చేసుకున్నాడన్నారు. 'అధికారం పోయిన ఏడాదిలోనే ఇంత అసహనం, అసాంఘిక శక్తులుగా మారిన బీఆర్ స్ నిజస్వరూపం ప్రజలకు అర్థమవుతోంది అని పొంగులేటి పేర్కొన్నారు.

## దాడి కారకులను శిక్షించాలి

**(మొదటిపేజీ తరువాయి)** హత్యాయత్నం వంటి ఘటనలకు పూనుకోవడం వెనకాల బలమైన కుట్ర దాగి ఉందనే అనుమానాలకు బలం చేకూరుతుందన్నారు. తీవ్రంగా గాయపడిన ఏ అధికారిని ఎవరు పరామర్శించలేదన్నారు. చివరకు కొందరు అధికారులపై జరిగిన దాడిని సైతం పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. లగచర్ల ఘటనలో దాడికి గురైన ఉద్యోగులను కాకుండా దాడికి పాల్పడిన వారిని కొందరు నాయకులు పరామర్శించడం దారుణమన్నారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## తూచ్...

**(మొదటిపేజీ తరువాయి)** ఇళ్లను కూల్చే అధికారం ప్రభుత్వానికి లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సరైన విధానం పాటించకుండా ఇల్లు కూల్చడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. దేశవ్యాప్తంగా బుల్డోజర్ యాక్షన్‌కు సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది.

**హైడ్రా కమిషనర్ స్పందన..**

సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. కూల్చివేతలకు 15 రోజుల ముందు భవన యజమానికి తప్పనిసరిగా నోటీసులు ఇవ్వాలని రిజిస్టర్ పోస్టులో నోటీసులు పంపడంతో పాటు నిర్మాణానికి నోటీసులు అంటించాలంటూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రస్తావించారు. నీటి వనరులు, రోడ్లు, ఫుట్‌పాత్‌లు తదితర ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుల విషయంలో సుప్రీం కోర్టు తీర్పు వర్తించదని రంగనాథ్ చెప్పుకొచ్చారు. జీహెచ్ఎంసీ చట్టం-405 ప్రకారం రోడ్డు, చెరువులు, నాలాలు తదితర ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపునకు ఎలాంటి నోటీసు జారీ చేయాల్సిన అవసరం లేదని ఇప్పటికే ఓసారి స్పష్టం చేసిన హైడ్రా కమిషనర్ అదే విషయాన్ని మరోసారి వెల్లడించారు.

# నువ్వెంత..? నీ లెక్కెంత..?

- మోడే ఏం చేయలేక పోయాడు..?
- నీ ఉడుత ఊపులకు భయపడేటోళ్లు లేరిక్కడ..?
- ఏం చేసుకుంటావో చేసుకో..
- ఎన్ని కేసులైనా పెట్టుకో..
- ఎక్కడున్నా నిన్ను వదిలేది లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మీడియా చిట్ చాట్లో సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు



**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** ప్రధాని నరేంద్ర మోడీకే భయపడలేదు.., చిట్టినాయుడు (రేవంత్) నువ్వెంత..? నీ ఉడతా ఊపులకు భయపడే వ్యక్తిని కాను అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టుకుంటావో పెట్టుకో.., నన్ను జైల్లో పెట్టినా నిన్ను మాత్రం విడిచిపెట్టే ప్రసక్తే లేదు.. అని హెచ్చరించారు. నేను డ్రగ్స్ తీసుకోలేదు, ఫోన్లు ట్యాపింగ్ చేయలేదు, అవినీతి అంతకన్నా చేయలేదని స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టుకుంటావ నీ సొంత నియోజకవర్గం మీదే నీకు పట్టులేదన్నారు. ఇంత వీక్ ముఖ్యమంత్రి దేశంలో ఎవరైన ఉన్నారా? అని ప్రశ్నించారు. అలాంటి అసమర్థముఖ్యమంత్రి కేసీఆర్ ను ఫినిష్ చేస్తా అని అంటున్నారన్నారు. ముందు నువ్వు ఫినిష్ కాకుండా చూసుకో అని కేటీఆర్ హెచ్చరించారు. నీ పదవికి ఎసరు పెట్టటానికి నల్గొండ, ఖమ్మం బాంబులు వేచి చూస్తున్నాయన్నారు. గురువారం తెలంగాణ భవన్ లో మీడియాతో కేటీఆర్ చిట్ చాట్ చేశారు. రేవంత్ కుట్రలకు ఇక్కడ భయపడేవాళ్లు ఎవ్వరూ లేరన్నారు. లగచర్లలో భూముల సేకరణ అంశంలో ప్రభుత్వం తీవ్రంగా భంగపడిందన్నారు. దాన్ని కవర్ చేసుకునేందుకే ఇది కుట్ర అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రేవంత్ ప్రభుత్వం రైతుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఇంత అరాచకం జరుగుతుంటే గతంలో మానవ హక్కుల గురించి మాట్లాడిన కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్ లాంటి వాళ్లు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు.

### పూర్తి ఇంటలిజెన్స్ వైఫల్యం..

లగచర్లలో జరిగిన ఘటనలో పూర్తిగా ఇంటలిజెన్స్, పోలీసుల వైఫల్యం ఉందన్నారు. అభిప్రాయ సేకరణ జరుగుతున్న సమయంలో పోలీసులు ఎందుకు అక్కడ లేరని ప్రశ్నించారు. తన మీద కేసు పెడితే ఊరుకుంటా అనుకుంటే రేవంత్ రెడ్డి అంత పిచ్చోడు మరొకరు ఉండరన్నారు. జైలు నుంచి వచ్చాక కూడా పోరాటం చేస్తానని హెచ్చరించారు. కలెక్టర్ పై జరిగిన దాడి ఘటనలో రైతులను పోలీసులు తీవ్రంగా కొట్టారన్నారు. వారికి కనీసం మెడికల్ ఎగ్జామినేషన్ కూడా చేయించలేదన్నారు. ఈ విషయాన్ని ఇంతటితో వదిలిపెట్టనన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కులు, మహిళా కమిషన్ వరకు తీసుకెళ్తానని స్పష్టం చేశారు.

### ఎనిమిదేళ్ల తమ కష్టాన్ని బూడిద పాలు చేశారు..

ఫార్మా సిటీని కేసీఆర్ మంచి ఉద్దేశంతో ముచ్చర్లలో పెట్టారన్నారు. అందుకోసం చైనాకు వెళ్లి అక్కడ 70 వేల ఎకరాల్లో ఉన్న తయారీ పరిశ్రమను పరిశీలించి వచ్చారన్నారు. ఎకానమీ ఆఫ్ స్కేల్ అనే ప్రయోజనం ఉండే విధంగా ఫార్మాసిటీ ని ప్లాన్ చేశారు. దీని కోసం ఎనిమిదేళ్లు కష్టపడి 14 వేల ఎకరాల భూమి సేకరించామన్నారు. కొడంగల్ లో భూముల సేకరణకే ఇంత గొడవ జరిగితే ముచ్చర్లలో ఎంతో విలువైన భూములు ఉన్నాయన్నారు. వాటిని సేకరించే విషయంలో ఇంకా ఎంత గొడవ జరగాలి...? అని ప్రశ్నించారు. కానీ మేము రైతులను ఒప్పించి వారికి నచ్చచెప్పి భూసేకరణ చేశామన్నారు. ఫార్మాసిటీ పర్మిషన్ కోసం కేంద్రంలో ఉన్న వాళ్లు చెప్పిన అన్ని కండిషన్స్ ఒప్పుకొని 18 నెలలు కష్టపడితే పర్మిషన్ వచ్చిందన్నారు. ఇవన్నీ ప్రస్తుత ముఖ్యమంత్రికి తెలియవన్నారు. అందుకే రాగానే ఫార్మాసిటీ రద్దు అంటూ ప్రకటన చేశాడన్నారు. ఇప్పుడు రేవంత్ ప్రతిపాదిస్తున్న ఫార్మా విలేజ్ లకు పర్మిషన్ రావటానికి కూడా ఏడాది కి పైగా సమయం పడుతుందన్నారు. ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ అంటూ రేవంత్ రెడ్డి మాటలు చెబుతున్నాడని కానీ అది జరగటం సాధ్యం కాదన్నారు.

### అంత తేలికేం కాదు..

తాను గతంలో పరిశ్రమల మంత్రిగా చేసిన అనుభవంతో చెబుతున్నా ఓ ప్లేస్ నుంచి మరొక ప్లేస్ కు పరిశ్రమలను తరలించటం అనేది అంత సులువైన పని కాదని కేటీఆర్ అన్నారు. కేవలం కేసీఆర్ చేసిన దానికి వ్యతిరేకంగా చేయాలన్న ఉద్దేశంతోనే ఫార్మా సిటీ కి ఫార్మా విలేజ్ పేరు మార్చి మేము చేసిన దానికి విరుద్ధంగా చేస్తున్నాడని మండిపడ్డారు. ఫార్మా విలేజ్ పేరుతో రియల్ ఎస్టేట్ దందా చేయాలని రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నాడన్నాడు. వెల్దడలో వాళ్ల బంధువులు, కుటుంబ సభ్యులకు భూములు ఉన్నాయన్నారు. సీఎం కు తన సొంత నియోజకవర్గంపై కూడా పట్టులేదన్నారు. సీఎం నియోజకవర్గంలో కలెక్టర్ పై దాడి చేసేంత బలమైన వ్యక్తులమా తాము.. అని ప్రశ్నించారు. అలా మేము చేయగలిగితే ఈ ప్రభుత్వం ఉన్నది ఎందుకు? మేము చెబితే రైతులు దాడులు చేస్తారా? అని అడిగారు. రేవంత్ కు ప్రభుత్వాన్ని నడపటం చేతకావటం లేదని, అందుకే ప్రాజెక్ట్ లు ఎలా పూర్తి చేయాలో తెలియదన్నారు. రేవంత్ రెడ్డి కి తానంటే చాలా ప్రేమ ఉన్నట్లు ఉందని, అందుకే తనను టార్గెట్ చేస్తున్నాడని కేటీఆర్ చమత్కరించారు.

# మా వాళ్లను విపరీతంగా కొట్టారు..

- థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలు పెట్టారు..
- భూమి ఇవ్వం అన్నందుకు అంతు చూస్తరా
- జరిగిన దారుణాలను చెప్పుకుని కన్నీరు పెట్టుకున్న బాధిత కుటుంబాలు..
- తెలంగాణ భవన్ పరుగులు పెట్టి ఆశ్రయించిన వైనం..
- కేటీఆర్ కు గోడు వెల్లబోసుకున్న మహిళలు



**జనపదం, బ్యూరో:** లగచర్లలో జరిగిన సంఘటనకు రాజకీయ రంగు పులిమి పేదల భూములు గుంజుకునే కుట్రను రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తమ భూములు కోల్పోతామని ఆవేదనతో రైతులు నిరసన తెలిపితే వాళ్లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి అమానుషంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన రైతుల కుటుంబాలకు చెందిన గిరిజన మహిళలు గురువారం తెలంగాణ భవన్ లో కేటీఆర్ ను కలిసి తమ గోడు చెప్పుకున్నారు. తమ ఇంట్లో మగవారిపై ఎంత కర్కషంగా వ్యవహరించారో చెబుతూ కంటతడి పెట్టారు. దాడితో సంబంధం లేకపోయినా తన భర్తను విపరీతంగా కొట్టి తీసుకెళ్లారని జ్యోతి అనే గర్భిణి మహిళ పోలీసుల దాడిని వివరిస్తూ బోరు విలపించింది. భూములు తీసుకుంటామని దాదాపు పది నెలలుగా ఇబ్బంది పెడుతున్నారని తమకు ఆ భూములే ఆధారమన్నారు. తమ వారిని తీవ్రంగా కొట్టటంతో వాళ్లు నడవలేని పరిస్థితిలో ఉన్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో భూములు తీసుకుంటామని మమ్మల్ని బెదిరిస్తున్నారని మా ఆధారం పోతే ఎలా బతకాలని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

### వీళ్లను చూస్తే దాడి చేసేవారిలా ఉన్నారా..

మహిళలను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ ఈ గిరిజన మహిళలను చూస్తుంటే ఎవరో చెబితే దాడి చేసే వారిలా కనిపిస్తున్నారా అని ప్రశ్నించారు. ఫార్మా విలేజ్ వస్తే ఏం ప్రయోజనమో కూడా వారికి చెప్పే ప్రయత్నం ప్రభుత్వం చేయలేదన్నారు. జానెడు భూమి కోసం పోరాటం చేస్తున్న రైతుల పై ఇంత పాశవికంగా దాడి చేయటమేమిటని ప్రశ్నించారు. గిరిజన రైతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారి కుటుంబ సభ్యులను విడిపించే వరకు పూర్తిగా బీఆర్ఎస్ పార్టీ తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు. గర్భిణీ మహిళ జ్యోతికి వైద్య సాయం అందిస్తామన్నారు. లగచర్లలో రైతులపై పోలీసులు అమానుష దాడిని జాతీయ మానవహక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటో గా స్వీకరించి విచారణ జరపాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ఎదుర్కొనేందుకు ప్రజాసంఘాలు, గిరిజన, దళిత సంఘాలు, మహిళా సంఘాలు ముందుకు రావాలన్నారు. అన్ని పార్టీలు కలిసి ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరముందని చెప్పారు. లగచర్ల ఘటనను స్థానిక ఎంపీగా ఉన్న డీకే అరుణ కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కేటీఆర్ కోరారు.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ..

- నాటి పాలనను రేవంత్ మరిపిస్తున్నారు..
- పాలనపై ప్రజా తిరుగు బాటు కొడంగల్ నుండే ప్రారంభం...
- బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇలాగే చేశామా..?
- మల్లన్నసాగర్ సందర్శనకు వెళ్తే రక్షణ కల్పించిన విషయం మరుస్తారా..?
- మాజీ మంత్రి హరీష్ రావు
- చర్లపల్లి జైల్లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో ములాఖత్



**జనపదం, చర్లపల్లి :** ఆనాటి ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన నేడు తెలంగాణ రాష్ట్రంలో కనిపిస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పేర్కొన్నారు. లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి కుట్ర కేసులో చర్లపల్లి జైల్లో ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని గురువారం కలిసి అరెస్టు తీరు, కేసుకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం బయటికి వచ్చిన హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన నియంతగా మారిందన్నారు. లగచర్లలో రైతులు మా భూములు మాకు కావాలని అడగడం తప్పా అని ప్రశ్నించారు. దానికి రైతులపై కేసులు పెడతావా ఇదెక్కడి న్యాయమన్నారు. అమాయకులైన గిరిజన రైతులను ఎందుకు జైల్లో వేశావని నిలదీశారు. అక్రమంగా అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, నాయకులను వేధించినా బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తూనే ఉంటుందని, నీ వెంట పడుతూనే ఉంటుందని తేల్చి చెప్పారు. పేదల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు నిలబడుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సమయంలో రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు మర్చిపోయారని గుర్తు చేశారు. 6 గ్యారంటీలతో పాటు ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యాన్ని ఇస్తున్నానని రేవంత్ రెడ్డి ఆనాడు ప్రకటించారని తెలిపారు. మరి రైతులు మా భూములు మాకు కావాలని ప్రశ్నిస్తుంటే అక్రమ కేసులు పెట్టి ఎందుకు భయభ్రాంతులకు గురి చేస్తున్నావని ప్రశ్నించారు. ఫార్మాసిటీ, ఫార్మా కంపెనీలను పెట్టాలనుకుంటే గత ప్రభుత్వం కేటాయించిన 14 వేల ఎకరాల్లో పెట్టాలని సలహా ఇచ్చారు. గిరిజన, దళిత, పేద రైతుల భూముల్లోనే ఎందుకు పెడుతున్నావని నిలదీశారు. సీఎం సోదరులు, బంధువుల కోసమే ఈ భూములను తీసుకుంటున్నారనే విషయం స్పష్టంగా తెలుస్తుందన్నారు. నాడు మల్లన్నసాగర్ లో రెండు రోజులు దీక్షలు చేస్తే రేవంత్ ను ఇలాగే అరెస్టు చేశామా అని ప్రశ్నించారు. ఊర్లోకి పంపి రక్షణ కల్పించామని గుర్తు చేశారు. ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయిస్తూ రేవంత్ రెడ్డి నియంతల వ్యవరిస్తున్నారని తెలిపారు. లగచర్లలో రైతులకు మానసిక ధైర్యం చెప్పేందుకు వెళ్తున్న ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, కార్తీక్ రెడ్డి ని అరెస్టు చేశారని తెలిపారు. స్థానిక ఎంపీ డీకే అరుణ వెళ్తే ఆమెను కూడా అరెస్టు చేశారని తెలిపారు. ఇక రేవంత్ రెడ్డికి కొడంగల్ నుంచే ప్రజా వ్యతిరేకత ప్రారంభమైందని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేకతతోనే కాంగ్రెస్ పార్టీ పతనమవుతుందన్నారు. ములాకత్ లో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, నాయకులు కార్తీక్ రెడ్డి, నందికంటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ చెబితేనే దాడి..

- లగచర్ల ఘటన వెనుక కుట్ర
- రేపటి నుంచి జిల్లాలు పర్యటిస్తా..
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- గాంధీ భవన్ లో మీడియా సమావేశం..



**జనపదం, హైదరాబాద్ సిటీ:** లగచర్లలో కలెక్టర్ పై దాడి ఘటన వెనుక కుట్ర కోణం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అనుమానం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కనుసన్నల్లోనే కలెక్టర్ పై దాడి జరిగిందని ఆరోపించారు. ప్రభుత్వం ఏ కార్యక్రమాన్ని తీసుకున్నా బీఆర్ఎస్, బీజేపీ నేతలు వాటిని తప్పు పట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. మూసీ పునరుజ్జీవంపై విమర్శలు చేశారని ఇప్పుడు లగచర్ల ఫార్మాపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఇలాంటి ఘటనలను ప్రోత్సహిస్తున్నారన్నారు. లగచర్ల ఘటన వెనుక ఎవరున్నా వదిలిపెట్టవద్దని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం రేవంత్ రెడ్డి కి ఎలాంటి భేషజాలు లేవన్నారు. ఏమైనా తప్పులు జరిగితే సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కానీ బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమ స్వార్థ రాజకీయాలు, అవసరాల కోసం ప్రజలను రెచ్చగొడుతున్నారని అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. లగచర్ల ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతోందన్న టీపీసీసీ చీఫ్.. ఆ కుట్రలో ఎంతటి వారున్నా ఉపేక్షించవద్దని ప్రభుత్వానికి సూచించారు. అభివృద్ధికి ఆటంకం కలిగితే మన తర్వాత తరాలు బాధలు పడతాయన్నారు. తాము తప్పు చేస్తే నిలదీయాలని అంతే తప్ప అభివృద్ధి నిరోధకులుగా మారవద్దన్నారు. కార్యకర్తల కృషి వల్లే పార్టీ అధికారంలోకి వచ్చిందని ఏడాది పాలన ఉత్సవాలను ప్రతి కార్యకర్త జరుపుకుంటారన్నారు. పార్టీ పరంగా రేపటి నుంచి విజయోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. పార్టీ, ప్రభుత్వం తరపున కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి తాను జిల్లాల్లో పర్యటించబోతున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పర్యటిస్తానన్న ఆయన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మొదలు పెడతామన్నారు. 18న మెదక్ పార్లమెంట్ లో నియోజకవర్గంలో పర్యటిస్తానన్నారు. పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్ త్వరలోనే విడుదల చేయనున్నట్లు చెప్పారు.

## పనులే.. పబ్లిసిటీ..

**(మొదటిపేజీ తరువాయి)** శంకుస్థాపన చేస్తారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ ట్యాంక్ బండ్, సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్ పరిసరాల్లో కూడా విజయోత్సవ వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజాపాలన విజయోత్సవాల నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, డిసెంబర్ 9న సెక్రటేరియట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఉంటుందని తెలిపింది. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలను ఆహ్వానించాలని కూడా యంత్రాంగం ప్రణాళిక పెట్టుకుంది. శాఖలవారీగా, విభాగాల వారీగా ప్రభుత్వం తొలి ఏడాదిలో సాధించిన విజయాలను, చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలనేదే అంతిమ లక్ష్యంగా విజయోత్సవాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

## మెదక్ జిల్లాకు ఎక్సలెన్స్ అవార్డు




**జనపదం, మెదక్:** ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌లో చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు మెదక్ జిల్లాకు ఎక్సలెన్స్ అవార్డు వచ్చింది. హైదరాబాద్‌లోని యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయం, తెలంగాణ ఐటీఈవి, సీ డిపార్ట్‌మెంట్ సహకారంతో నిర్వహించిన స్టేట్ లెవల్ ఆధార్ వర్క్‌షాప్‌లో మెదక్ జిల్లాకు ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక కాగా ఈ -డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్ అందుకున్నారు. కలెక్టర్ సహాయ సహకారాలతో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌లో మా వినూత్న కార్యక్రమాలు, ఆధార్ నుంచి గరిష్ట ప్రభావాన్ని పొందడం పౌరుల కోసం సమర్థవంతమైన పత్రాలను నవీకరించే వ్యూహాల కారణంగా ఈ గుర్తింపు లభించిందని సందీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జయేష్ రంజన్, అమద్ కుమార్ లు సందీప్ ను సత్కరించారు.

## గ్రూప్-4 ఫలితాలు విడుదల

**స్పాట్ వాయిస్, ఎడ్యుకేషన్:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 తుది ఫలితాలను వెల్లడించింది. 8,084 మందితో కూడిన ప్రొవిజినల్ జాబితాను విడుదల చేసింది. 2022 డిసెంబర్ 1న ఇచ్చిన నోటిఫికేషన్‌లో భాగంగా 8,180 పోస్టులకు గానూ 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. పలు దఫాల్లో ధ్రువపత్రాల పరిశీలన అనంతరం గురువారం సాయంత్రం ఫలితాలను వెల్లడించింది. పూర్తి వివరాల కోసం టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించింది.

## ఎస్సార్ యూనివర్సిటీలో గంజా కలకలం..

స్పాట్ వాయిస్, హన్మకొండ: హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం అన్నాసాగర్ లోని ఎస్సార్ ప్రైవేటు యూనివర్సిటీలో గంజాయి కలకలం రేగింది. గురువారం గంజాయి తాగుతున్న ఐదుగురు విద్యార్థులను నార్కోటిక్ టీమ్ పట్టుకున్నట్లు సమాచారం. ఈ మేరకు హాస్టల్ రూంలో తనిఖీ చేయగా.. గంజాయిని గుర్తించినట్లు తెలిసింది.

# కేంద్ర పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

- పెద్దపల్లి ఎంపీ గడ్డ వంశీకృష్ణ
- పెద్దపల్లి జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం



**జనపదం, పెద్దపల్లి:** జిల్లాలోని ప్రజలకు కేంద్ర ప్రాయోదిత పథకాల ద్వారా అధికంగా లాభం కలిగేలా అధికారులు పని చేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డ వంశీకృష్ణ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ గడ్డం వంశీ కృష్ణ అధ్యక్షతన కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ, డి.వేణుతో కలిసి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. దిశ సమావేశంలో ప్రస్తుతం వారి శాఖల పరిధిలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు, రాబోయే 3 నెలల కాలంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు తదితర అంశాల పై వివిధశాఖల అధికారులు నివేదికలు వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. నేషనల్ హెల్త్ మిషన్ కింద వివిధ కార్యక్రమాల అమలుకు అవసరమైన నిధులు ,ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యల ప్రతిపాదనలు అందించాలని అన్నారు. గర్భిణుల ఏఎన్సీ రిజిస్ట్రేషన్, మెరుగైన వైద్య చికిత్స అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని, రెగ్యులర్ గా పాఠశాలలను తనిఖీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కి సూచించారు. పీఎం శ్రీ పథకం కింద 11 పాఠశాలలకు నూతన భవనాలు, సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు రూ.20 కోట్లు వచ్చాయని, వీటిని పూర్తిగా వినియోగించాలని ఎంపీ పేర్కొన్నారు. విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించాలని అన్నారు. సుల్తానాబాద్ లో జరిగిన దుర్ఘటనలు మరో మారు జరగకుండా చూడాలని, చైల్డ్ సేఫ్టీ పై విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీ ఆదేశించారు. జిల్లాలో గ్యాస్ కనెక్షన్ లేని కుటుంబాలు ఏవైనా ఉంటే వారికి ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద కనెక్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్ , డి.ఆర్.డి.ఓ. ఆర్. రవీందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రైతును మోసం చేస్తున్న కాంగ్రెస్..


- కల్లాల్లో అన్నదాతల గోస పట్టని రేవంత్
- వడ్లు కొంటలేరని ధర్నాలు.. రాస్తారోకోలు
- రూ.500 వందల బోనస్ బోగస్సే..
- తాగుబోతుల రాష్ట్రంగా చేయాలన్నదే రేవంత్ తాపత్రయం
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు
- సిద్ధన్నపేటలో కొనుగోలు కేంద్రం పరిశీలన



**జనపదం, సిద్దిపేట ప్రతినిధి :** కాంగ్రెస్ రైతులను మోసం చేస్తోందని, కల్లాల్లో అన్నదాతలు పడుతున్న గోస ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు పట్టడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. గురువారం సిద్దిపేట నియోజకవర్గం నంగునూర్ మండలం సిద్దన్నపేట గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలతోపాటు ముఖ్యంగా రైతులను మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వ తీరువల్ల పత్తి, వడ్లు పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం, రైస్ మిల్లుల టై అప్ చేయడం ఆలస్యం కావడం, డబ్బులు ఆలస్యంగా ఇవ్వడం కారణంగా సగానికి సగం ధాన్యాన్ని రైతులు దళారులకు అమ్మి నష్టపోయారన్నారు. రూ.2300 మద్దతు ధర ఉంటే రైతులు రూ.1900కే ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రూ.500 వందల బోనస్ బోగస్ అయిపోయిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వానకాలం రైతు బంధు వేయలేదన్నారు. కేసీఆర్ హయాంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా అన్నింటిని ఎదుర్కొని రైతులకు పెట్టుబడి సాయం చేశామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వడ్లు కొనుగోలు చేయకపోతే అధికారులను ఎవ్వరినీ అడగట్లేదని, .కానీ మద్యం అమ్మకాలు చేయకపోతే ఎక్సైజ్ సూపరింటెండెంట్, సీఐలను ట్రాన్స్ ఫర్ చేశాడని ఎద్దేవా చేశారు. మద్యం అమ్మకాలు చేయకపోతే చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. వడ్లు కొనుగోలు చేయకపోతే ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. తెలంగాణాను రేవంత్‌రెడ్డి తాగుబోతులను చేయలనుకుంటున్నాడన్నారు . ఆడబిడ్డల పుస్తెలు తెంపాలని, రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణ చేయాలని అనుకుంటున్నాడని, సీఎం ప్రజలకు మద్యం తాగించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాడు.. రైతులకు ప్రాధాన్యత ఇవ్వట్లేదన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఎవరికోసం పనిచేస్తుందని, యాసంగికి ముందే రైతులకు రైతుబంధు, రూ.2లక్షల రుణమాఫీ చేయాలని ఎన్నికల మానిఫెస్టోలు చెప్పిన ప్రకారం రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలి డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులు అప్పులు తెచ్చి, భార్య మెడలోని బంగారం తాకట్టు పెట్టి మరీ బ్యాంకుల్లో రుణాలు కడుతున్నారని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11 నెలలైనా రైతులకు రుణమాఫీ చేయట్లేదని, .కానీ, మహారాష్ట్రకు వెళ్లి తెలంగాణలో రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నాడన్నారు. తెలంగాణ రాకముందు సిద్దిపేట జిల్లాలో 50 వేల మెట్రిక్ టెన్నుల ధాన్యాన్ని మాత్రమే ఇక్కడ రైతులు పంటలు పండించే వారని, కానీ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం నీటితో చెరువులు నింపి, 24గంటల కరెంటు ఇచ్చి, మండలానికి ఓ మార్కెట్ కట్టిండడని గుర్తు చేశారు.. దీంతో రైతులు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ షరతులు లేకుండా పూర్తి రుణమాఫీ చేయాలని, రైతుబంధు డబ్బులు వేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాకముందు సిద్దిపేట జిల్లాలో 5లక్షలకు ఎకరం ఉండేదని, భూములకు విలువ లేకుండే.. కానీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఎకరం భూమి రూ.50లక్షలు చేసిండన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక భూములకు విలువ తగ్గిపోయిందని, రియల్ ఎస్టేట్ మొత్తం పడిపోయిందని, భూములు కొనే దిక్కు లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి, మద్దతు ధరతో వడ్లు కొనుగోలు చేయాలన్నారు. సిద్దిపేట జిల్లాలో ఇప్పటి వరకు ఎక్కడ సన్న వడ్లు కొనుగోలు చేయలేదని, కాంగ్రెస్ సన్న వడ్లకు సున్న.. దొడ్డు వడ్లకు గుండుసున్న పెట్టిందన్నారు. ఆయన వెంట నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ వి దుర్మార్గపు రాజకీయాలు

- ఆ పార్టీ నేతలు ప్రభుత్వాన్ని కూల్చడమే పనిగా పెట్టుకున్నారు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**జనపదం, గాంధీభవన్ :** అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ దుర్మార్గపు రాజకీయాలు చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. ప్రజా ప్రభుత్వాన్ని కూల్చడమే లక్ష్యంగా పెట్టుకున్న ఆ పార్టీ నేతలు అమాయక ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. అలాంటి చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. గురువారం గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన ఏ విషయంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందో చెప్పాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల స్థాపన ప్రభుత్వ వైఫల్యమా? పంట నష్టం రైతులు ప్రమాదవశాత్తు చనిపోతే వాళ్లకు ఇన్సూరెన్స్ చెల్లించడం వైఫల్యమా? సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించడం ప్రభుత్వ వైఫల్యమా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌అధినేత కేసీఆర్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏనాడు సచివాలయానికి రాలేదన్నారు. ఎప్పుడు ప్రభుత్వాన్ని అట్లా కూల్చాలి, ఎట్ల కూల్చాలని చూస్తున్నారన్న భట్టి.. ప్రభుత్వానికి ప్రతిపక్షాలు ప్రజా స్వామ్యయుతంగా సహకరించాలన్నారు. నిరుద్యోగుల కోసమే ప్రత్యేక తెలంగాణ ను తెచ్చుకున్నామన్న భట్టి.. రైతుల కోసం రూ.18వేల కోట్లు రుణమాఫీ చేశామన్నారు. అన్ని వర్గాలకు ఉపయోగపడే కులగణనను కొంతమంది అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ గురించి కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న ఆయన దేశ స్వాతంత్రం కోసం అనేక ఏళ్లు జైలు జీవితం గడిపాడన్నారు. కుల గణన విప్లవాత్మక నిర్ణయమని, దేశానికి తెలంగాణ రోల్ మోడల్ కాబోతుందని భట్టి ధీమా వ్యక్తం చేశారు. స్కీములు పెరగాడానికి కులగణన చేస్తున్నామని స్పష్టం చేశారు. కుల గణన చేశామని మాట ఇచ్చామని, ఇచ్చిన మాను చేసి చూపిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కుల గణన ఎంతగానో ఉపయోగపడుతుందని వెల్లడించారు. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకొనే ప్రశ్నలు తయారు చేశామన్నారు.



## వేములవాడ రాజన్న ఆలయానికి మాస్టర్ ప్లాన్

- నిధుల కోసం సీఎం, డిప్యూటీ సీఎంతో చర్చిస్తాం
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వేములవాడ అభివృద్ధిపై మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్ తో సమీక్ష

**జనపదం, సెక్రటేరియట్ :** రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒక్కటైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధిపై రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే కొన్ని ప్రతిష్టాత్మక కార్యక్రమాలను అమలు చేస్తుండగా.. పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఈ క్రమంలోనే ఆలయ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ అమలు చేయనున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. దక్షిణ కాశీగా పేరుపొందిన వేములవాడ రాజన్న ఆలయానికి మహర్దశ పడుతుందని, రాజరాజేశ్వర దేవస్థానం అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ అమలు చేయనున్నట్లుగా మంత్రి సురేఖ ప్రకటించారు. సచివాలయంలో దేవాదాయ శాఖ పేషీ కాన్ఫరెన్స్ హాలులో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వపల్లి సత్యనారాయణ, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతు, వేములవాడ ఈవో వినోద్‌తో కలిసి మంత్రి కొండా సురేఖ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో వేములవాడ ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై, మాస్టర్ ప్లాన్ అమలుపై సమగ్రంగా చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి మాట్లాడుతూ వేములవాడ ఆలయ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్టు తెలిపారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు కోసం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించనున్నట్టు పేర్కొన్నారు. వేములవాడలో మాస్టర్ ప్లాన్ అమలు చేసి సరికొత్త శోభను తీసుకొచ్చేందుకు కృషి చేయనున్నట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు.

## ఐక్యంగా జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం..

- అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేయాలి
- దిశ చైర్మన్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్



**జనపదం, జగిత్యాల :** ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులమంతా కలిసి పని చేసి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని దిశ చైర్మన్, నిజామాబాద్ పార్లమెం ట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం చైర్మన్ ధర్మపురి అరవింద్ అధ్యక్షతన జరిగింది. జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్, ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, అ దనపు కలెక్టర్లు బిఎస్ లత, గౌతమ్ రెడ్డి తో కలిసి చై ర్మన్ కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ శాఖలకు వచ్చే నిధులకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తోందని, నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. దిశ ప్రాముఖ్యతను గుర్తించి సమావేశంలో ప్రతిపాదించిన, చర్చించిన, పరిష్కార విషయాలను మూడు మాసాలకు సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు స్వచ్ఛ భారత్ కింద బాత్ రూమ్ లకు ప్రాధాన్యత కల్పిస్తూ కొత్త వాటికి ప్రతిపాదనలు ఇవ్వకుండా మరమ్మతులకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. జగిత్యాల జిల్లాను స్మార్ట్ సిటీలో భాగం చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా సమావేశంలో అమృత్ పథకం, సమగ్ర శిక్ష అభియాన్ నేషనల్ హైవేస్, గ్రామీణ సడక్ యోజన, నేషనల్ హెల్త్ మిషన్ ఆవాస్ యోజన, సెంట్రల్ ఫండ్ ద్వారా వివిధ రోడ్డు ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ప్రోగ్రాం మెట్రిక్ స్కాలర్ షిప్స్, మల్టీ సెలర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్, లేబర్ డిపార్ట్మెంట్ మైనారిటీ స్కూల్ నేషనల్ లైట్ మిషన్ స్వచ్ఛభారత్, పీఎం సమ్మది పై రివ్యూ చేశారు. ప్రభుత్వం అందించే నిధులను రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. స్వచ్ఛ భారత్, పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బి, ఉపాధి హామీ, విద్యుత్ , మిషన్ భగీరథ, జాతీయ రహదారులు,తదితర అంశాలపై సమీక్షించారు. ముందుగా జిల్లాలోని ఆర్మూర్ మంచిర్యాల ఎన్ హెచ్ 63, జగిత్యాల డివిజన్ కోరుట్ల మెట్ పల్లిలో జరుగుతున్న నాలుగు వరుసల రోడ్డు పనులను త్వరిగతన పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ ఈ జీ ఎస్ నిధుల కింద జిల్లాలో మంజూరైన రోడ్లు, బ్రిడ్జిలను, దమ్మన్నపేట కాచారం రోడ్డును పూర్తి చేయాలని తెలిపారు. అమృత పథకం కింద జిల్లాలో మొత్తం జరుగుతున్న ప్రాజెక్టు వివరాలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లాలో పీహెచ్ సెంటర్ 70 సబ్ సెంటర్ 150 అధికారులు తెలిపారు. త్వరలో దిశ కమిటీ వేసి సభ్యులను నామినేట్ చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంలోని ఎఫ్ సీ ఐ ద్వారా జరిగే వడ్ల కొనుగోలు సజావుగా జరిగేలా దృష్టి సారించాలని, జిల్లా అధికారులు, ఎఫ్ సీ ఐ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మిగిలిన ధాన్యం నిల్వలు కూడా రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు, ఎఫ్ సీ ఐ నిబంధనలకు అనుగుణంగా కొనుగోళ్లు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో రఘువరన్, మున్సిపల్ అధ్యక్షులు అడువాల జ్యోతి, మోర హనుమండ్లు , వివిధ జిల్లా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతన్న అడిగితే నెంబర్లు ఇచ్చా..

- ఫోన్ టాపింగ్ కేసులో ముగిసిన లింగయ్య విచారణ
- అంతకు ముందు జూబ్లీహిల్స్ పీఎస్ లో మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు..



**జనపదం, హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను పోలీసులు గురువారం విచారించారు. విచారణ అనంతరం లింగయ్య మీడియాతో మాట్లాడారు. అడిషనల్ ఎస్పీ తిరుపతన్నతో మాట్లాడిన కాల్స్ పై పోలీసులు విచారణ చేశారని వెల్లడించారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు తాను సమాధానం చెప్పానని, తనకు తెలిసిన అధికారి కావడంతో తాను గతంలో అడిషనల్ ఎస్పీ తిరుపతన్నతో మాట్లాడినట్లు చెప్పానన్నారు. ఆ తర్వాత మదన్ రెడ్డి, రాజ్ కుమార్ ఫోన్ నంబర్లు తిరుపతన్న అడిగాడని, వారి ఇద్దరి ఫోన్ నంబర్ల తమ అనుచరుల దగ్గర నుంచి తీసుకొని అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకి ఇచ్చానన్నారు. అప్పుడే ఈ నంబర్లు ఎందుకని తిరుపతన్నను ప్రశ్నించానని చెప్పినట్లు లింగయ్య తెలిపారు. మును గోడు ఎన్నికల సమయంలో ప్రచారం ఎలా జరుగుతుందని తిరుపతన్న పలుమార్లు అడిగాడని, ప్రచారం బాగా జరుగుతుందని తాను ఫోన్లో మాట్లాడానన్నా రు. కాగా, వేముల వీరేశం అనుచరుల ఫోన్ టాప్ చేశాననేది అవాస్తవం అని, కుట్రపూరిత ఉద్దేశంతో కొంతమంది తనపై కామెంట్స్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ కేసులో ఎప్పుడు విచారానికి పిలిచినా తాను పోలీసులకు సహకరిస్తానని, ఈ కేసుకు తనకు ఎలాంటి సంబంధం లేదని, తిరుపతన్నతో మాట్లాడిన కాల్ లిస్ట్ ఆధారంగానే విచారణ కోసం పోలీసులు పిలిచారని, పోలీసుల దగ్గర ఏదో ఆధారం ఉంది కాబట్టే విచారించారని మాజీ ఎమ్మెల్యే లింగయ్య చెప్పారు.

### అంతకు ముందే భాస్కర్ రావు

బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఈ వ్యవహారం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. ఇప్పటి వరకు కేవలం పోలీసులకే పరిమితం అయిన ఈ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు సైతం నోటీసులు అందుతున్నాయి. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆయనతో మరో ఇద్దరు నేతలకు సైతం నోటీసులిచ్చారు. అయితే, అనూహ్యంగా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మిర్యాగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ప్రత్యక్షమయ్యాడు. కొంతసేపు ఆయన పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లాడు. దాదాపు రెండు గంటల తర్వాత బయటకు వచ్చాడు. దీంతో ఆయన కూడా ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు వచ్చాడా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




## ఏసీబీ వలలో చిక్కిన లింగంపేట ఎస్సై..

**జనపదం, కామారెడ్డి :** కామారెడ్డి జిల్లా లింగంపేట్ పోలీస్ స్టేషన్లో ఎస్సై అరుణ్ కుమార్, రైటర్ రామస్వామి ఒక వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుపడ్డారు. గురువారం పోలీస్ స్టేషన్ లోనే లంచం తీసుకుండగా నిజామాబాద్ ఏసిబి డిఎస్పి శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో లింగంపేట ఎస్సై అరుణ్ కుమార్ ను, రైటర్ రామస్వామిని గురువారం పోలీస్ స్టేషన్లో నేరుగా లంచం తీసుకుంటుండగా ఎసిబి డిఎస్పి శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిఘా వేసి పట్టుకున్నారు. ఓ కేసులో శివలింగ గౌడ్ నుంచి పదివేల లంచం తీసుకున్నట్టు సమాచారం రాగా గడిచిన వారం రోజుల్లో ఇద్దరు ఎస్సైలు ఎసిపికి పట్టు పడడం గమనార్హం. గత వారం నిజామాబాద్ జిల్లా వర్ని ఎస్సై కృష్ణమూర్తి స్టేషన్ బెల్ ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ పట్టుబడిన విషయం తెలిసిందే. ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో ఏసీబీ వలల్లో చిక్కడం సర్వసాధారణంగా కనబడుతుంది. అవినీతి నిర్మూలించాలని ఉన్నత అధికారు లు పేర్కొంటున్నప్పటికి, కిందిస్థాయి అధికారులు అవేం పట్టించుకోకుండా, ఏం కాదనే ధీమాతో ఏసిబి దాడులు జరుగుతున్నా ఎటువంటి భయం లేకుండా అవినీతికి పా ల్పడడం అలవాటుగా మారింది. పోలీస్ స్టేషన్ కు వెళ్దామంటే ప్రజలు భయపడుతున్నారు. పోలీసులు ఎక్కడ లంచాలు అడుగుతారో అని వారిలో భయం చుట్టుకుంది. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి పోలీస్ స్టేషన్ కు వెళ్లాలంటే భయాందోళన గురవుతున్నారు. న్యాయం చేసే పోలీసులు లంచాలు తీసుకుంటే న్యాయం ఎక్కడ జరుగుతుందని పోలీసులను గ్రామస్థాయి ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## కొనుగోళ్లలో సమస్యలు ఉత్పన్నం కావొద్దు..

- 48 గంటల్లో రైతులకు డబ్బులు అందేలా చూడాలి
- చివరి గింజ వరకూ కొనేలా చర్యలు
- కాంగ్రెస్ రైతు పక్షపాత ప్రభుత్వం
- మంత్రి కొండా సురేఖ
- ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
- తేమ, తాలు పేరుతో ఇబ్బంది పెట్టే మిల్లర్ల పై కఠిన చర్యలకు ఆదేశం



**జనపదం, హైదరాబాద్ :** ప్రస్తుత సీజన్ లో రికార్డు స్థాయిలో 80 లక్షల టన్నుల ధాన్యం సేకరణను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని, కొనుగోళ్లలో చిన్న సమస్య కూడా ఉత్పన్నం కావొదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కార్యాచరణతో ధాన్యం కొ నుగోళ్లు చేపట్టాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. రోజువారి ధాన్యం సేకరణ, సేకరించిన దొడ్డు రకం, సన్న రకం ధాన్యం వివరాలు, కొనుగోలు కేంద్రాలు, రైతులు, రైతులకు చేసిన చెల్లింపుల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను ఏ రోజుకారోజు తన కార్యాలయానికి పంపా లని ఆదేశించారు. గురువారం సెక్రటేరియట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల కలెక్టర్లు రాహుల్ రాజ్, వల్లూరు క్రాంతి, మిక్కిలినేని మను చౌదరి తో ధాన్యం కొనుగోళ్లపై వీ డియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్ల తీరుతెన్నులపై ఆరా తీసిన మంత్రి రైతుల ఖాతాల్లో డబ్బులు ఎన్ని రోజుల్లో జమ అవుతున్నాయని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మద్దతు ధర, బోనస్ చెల్లింపులు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రైతులకు అందుతున్నదీ లేనిది నేరుగా రైతులతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఆరా తీయాలని అధికారులను ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని మిల్ల ర్లతో మాట్లాడి వీలైనంత త్వరలో మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం నిల్వకు సంబంధించిన సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. కాగా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సన్న వడ్ల కొనుగోలుకు ప్ర త్యేక కొనుగోలు కేంద్రాలు, ప్రత్యేక కాంటాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్లు మంత్రి సురేఖకు తెలిపారు. మరోవైపు సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి అక్రమంగా ప్రవేశించకుండా తీసుకుంటున్న చర్యలపై మంత్రి సురేఖ కలెక్టర్లను ప్రశ్నించారు. పోలీస్, రెవెన్యూ, సివిల్ సప్లైస్ అధికారుల సమన్వయంతో ధాన్యం అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్లు మంత్రికి వివరించారు. తేమ పేరుతో మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. సివిల్ సప్లైస్ ఆధ్వర్యంలో నడిచే కాల్ సెంటర్లు 24 గంటలు రైతులకు అందుబాటులో వుండేలా చర్యలు చే పట్టాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు భోజనాలు అందించే అంశాలను పరిశీలించాలన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, ఇచ్చిన మాటకు కట్టుబడి రైతు రుణమాఫీ, సన్నాలకు ఎమ్మెస్పీకి అదనంగా ఒక్కో క్వింటాల్ కు రూ. 500 ల బోనస్ ఇచ్చి చేతల ప్రభుత్వంగా నిరూపించుకున్నామన్నారు.

## ఫోన్‌ట్యాపింగ్‌లో కేటీఆర్ కీలక పాత్ర

- నన్ను ఓడించాలనుకున్నా గెలుపును ఆపలేకపోయారు
- ఎమ్మెల్యే వేముల వీరేశం



**జనపదం, గాంధీ భవన్ :** ఫోన్ ట్యాపింగ్ లో కేటీఆర్ పాత్ర ఉందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సంచలన వ్యాఖ్యలు చేశారు. బతుకుమీద ఆశ లేదా? అని కేటీఆర్ తనను బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. గురువారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ చేయించినా తన గెలుపును మాత్రం ఆపలేకపోయారని తెలిపారు. ఎవరు ఏం మాట్లాడారో కేటీఆర్ దొంగ చాటుగా ఫోన్లు విన్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఆయన చేసిన దుర్మార్గాలను ఒక్కొక్కటిగా బయట పెడతామన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసింది.. విన్నది కేటీఆరే అన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో ప్రభాకర్ రావు టేబుల్‌పై గన్ పెట్టి తనను బెదిరించారని ఆరోపించారు. అలాగే వికారాబాద్ లగచర్ల ఘటనలోనూ కేటీఆర్ హస్తం ఉందని వీరేశం ఆరోపించారు. సురేశ్ కాల్ రికార్డింగ్‌లో కేటీఆర్ బండారం బయటపడిందన్న ఆయన కేటీఆర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

## బొంతపల్లిలో దారుణ హత్య

- తల్లి కొడుకును హతమర్చిన నిందితుడు
- పాత కక్షలే కారణం
- కేసు విచారణ చేస్తున్న పోలీసులు

**జనపదం, బ్యూరో :** గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరభద్రనగర్ కాలనీలో తల్లి కొడుకును నడిరోడ్డుపై కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన నాగరాజు (30) బొంతపల్లి లోని వీరభద్రనగర్ లో నివాసం వుంటున్నాడు. రెండు సంవత్సరాల క్రితం వీరి కుమారుడు నీటి సంపులో పడి మృతి చెందాడు. వీరి ఇంటి ప్రక్కనే ఉత్తరప్రదేశ్ కి చెందిన సరోజ కుటుంబం నివాసం ఉంటుంది. తన కుమారుడి మృతికి కారణం తన ఇంటి పక్కనే వున్న సరోజ(50), అతని కుమారుడు అనీల్ (30) కారణమని భావిం చాడు నాగరాజు. అప్పటినుంచి నాగరాజు సరోజ, అనిల్ పై ప గను పెంచుకున్నాడు. కాగా గురువారం ఉదయం ఇంట్లో నుండి తల్లి కొడులులు బయటకు రాగానే ఇదే అదునుగా భావించిన నాగరా జు తల్లి కొడుకును కత్తితో పొడిచి హత్య చేశాడు. తీవ్రమైన గాయా లతో రక్తపు మడుగుల మధ్య తల్లి అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని జిన్నారం సీఐ సుధీర్ కుమార్, గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్ రెడ్డీలు పరిశీలించారు.



## రాష్ట్రంలో 35 లక్షల సభ్యత్వాల నమోదు

**మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర రావు**

**జనపదం, నాంపల్లి :** రాష్ట్రంలో ఇప్పటి వరకు 35 లక్షల బీజేపీ సభ్యత్వాలు నమోదు చేసినట్లు ఆ పార్టీ మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచంద్ర రావు తెలిపారు. ఈనెల 25వ తేదీ నాటికి 50 లక్షల సభ్యత్వాలను స్వీకరిస్తామని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో రామచంద్ర రావు మాట్లాడారు.. బీజేపీ సంస్థాగత ఎన్నికల దృష్ట్యా సభ్యత్వ నమోదు స్వీకరణ వేగవంతంగా సాగుతోందని అన్నారు. ఈనెల 25వ తేదీ తర్వాత సంస్థాగత ఎన్నికల పర్వం మొదలవుతుందని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజా విశ్వాసాన్ని కాంగ్రెస్ సర్కార్ కోల్పోయిందన్నారు. రేవంత్ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలను ఉధృతం చేస్తామని రామచంద్ర రావు చెప్పారు.

# రైతులను భయపెడుతున్నారు



- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

**జనపదం, హైదరాబాద్ సిటీ:** లగచర్ల గ్రామ రైతులు తమ భూములను ఇవ్వమంటున్నా భయపెడుతున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. కొంతమంది దళారులు, మధ్యవర్తులు అసైన్డ్ భూములు పొందిన వారిని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. మరికొంతమంది పట్టా భూములు కలిగి ఉన్నవారి నుంచి బలవంతంగా భూములను సేకరించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ మేరకు గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఈటల రాజేందర్ మాట్లాడారు.. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లో ఫార్మా కంపెనీ ఏర్పాటు పేరుతో లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, పులిచర్ల గ్రామాల్లోని సుమారు 1350 ఎకరాలతో పాటు మరో 1500 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించాలని ఆలోచన చేస్తున్నట్లు స్థానిక ప్రజలు భావిస్తున్నారని ఆయన తెలిపారు. భూమినే నమ్ముకుని బతుకుతున్న రైతుల నుంచి రూ. 40 లక్షల విలువైన భూమిని కేవలం రూ. 10 లక్షలకే గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి అహంకారంతో ప్రజాభిప్రాయ సేకరణకు కలెక్టర్ ను పంపించగా లగచర్ల ప్రజలు నిరసన తెలిపారని అన్నారు. స్వయంగా తనపై దాడి జరగలేదని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రకటించినప్పటికీ, రాత్రికి రాత్రే 1500 మంది పోలీసులను నాలుగు గ్రామాలకు పంపించి ప్రజలను అరెస్టు చేసి హింసించారని ఆయన ఆరోపించారు. అధికారులు సైతం సీఎం రేవంత్ రెడ్డికి బానిసలుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో ముచ్చర్లలో ఫార్మాసిటీ కోసం రైతుల నుంచి కోట్లాది రూపాయల విలువైన 14 వేల ఎకరాల భూమిని సేకరించారని అన్నారు. ఇప్పుడు ఆ భూములను ఫోర్త్ సిటీ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం వినియోగించాలని చూస్తున్నారని ఈటల రాజేందర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో అధికారమదంతో ప్రజల భూములు గుంజుకుంటూ హైడ్రా పేరుతో ఇండ్లు కూలగొడుతున్నారని అన్నారు. గతంలో జీఎంఆర్ ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం విలువైన భూములు ఇచ్చిన రైతులు ఇప్పుడు టాయిలెట్లు శుభ్రం చేస్తూ, అడ్డమీద కూలీలుగా దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.






# పది నెలల్లో 35 వేల కోట్ల పెట్టుబడులు

- లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో అద్భుత విజయాలు
- 51 వేల మందికి ఉద్యోగావకాశాలు
- మీడియాతో మంత్రి శ్రీధర్ బాబు

**జనపదం, హైదరాబాద్ బిజినెస్:** రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి ఏడాది పూర్తి కాకుండానే లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించి అద్భుత విజయాలు సాధించామని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. మంగళవారం హైటెక్ సిటీలో మీడియాతో మాట్లాడిన ఆయన పది నెలల కాలంలో రూ.35,820 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని తెలిపారు. 141 దేశీయ, బహుళ జాతి కంపెనీలు ఔషధ, టీకాలు, లైఫ్ సైన్సెస్, పరిశోధన రంగాల్లో నిర్మాణాలు మొదలు పెట్టడం, పూర్తి చేసుకుని ఉత్పాదన మొదలు పెట్టే దశల్లో ఉన్నాయని చెప్పారు. విస్తరణ పనులు చేపట్టిన కంపెనీలు ఉత్పాదన ప్రారంభించాయని వివరించారు. ఇవన్నీ పూర్తి అయితే 51,086 మందికి ఉద్యోగాలు లభిస్తాయని, మరో లక్షన్నర మందికి పరోక్ష ఉపాధి లభిస్తుందని శ్రీదర్ బాబు వెల్లడించారు. దేశంలో ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కొత్త కంపెనీలకు హైదరాబాద్ కేంద్ర బిందువు అయిందని తెలిపారు. రాష్ట్రంలో ఒకే చోట కాకుండా పలు ప్రాంతాల్లో ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ పరిశ్రమల్లో ఆధునిక కాలుష్య నియంత్రణ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా అనుమతులు ఇచ్చినప్పుడే నిబంధనలు విధించనున్నట్టు వివరించారు. ఆసియాలోనే మూడో అతి పెద్దదైన జపాన్ కు చెందిన టకెడా లైఫ్ సైన్సెస్ సంస్థ స్థానిక బయోలాజికల్ ఇ తో కలిసి ఏటా ఐదు కోట్ల డెంగ్యూ వ్యాక్సిన్లు ఉత్పత్తి చేస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు. వీటిని ప్రపంచవ్యాప్తంగా సరఫరా చేస్తుందని చెప్పారు. ప్రపంచంలోనే అతి పెద్ద పశు వైద్య సంస్థ జోయెటిస్ ఇటీవలే జిసిసి ని ప్రారంభించిందని వెల్లడించారు. ప్రపంచంలోనే అతి పెద్ద బయోటెక్నాలజీ కంపెనీ యామ్ జెన్ 3వేల మందికి ఉద్యోగులను నియమించుకునే జిసిసిని ప్రారంభించిందని వివరించారు. జోయెటిస్, యామ్ జెన్ సంస్థలు సిఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో ఒప్పందాలు చేసుకుని అతి కొద్ది కాలంలోనే జిసిసి సెంటర్లను ఏర్పాటు చేసాయని శ్రీధర్ బాబు వెల్లడించారు. వచ్చే రెండు నెలల్లో లైఫ్ సైన్సెస్ కంపెనీలు నెలకొల్పేందుకు ముందుకొచ్చే సంస్థలకు భూ కేటాయింపులు, ప్రోత్సాహకాలకు సంబంధించిన విధాన ప్రకటన సిఎం రేవంత్ రెడ్డి చేస్తారని శ్రీధర్ బాబు తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రం కూడా దీనికి సంబంధించిన పాలసీ రూపొందించలేదని తెలిపారు.

**ప్రజల డిమాండ్లు నెరవేర్చాకే భూసేకరణ చేపడతాం**

ఫార్మా క్లస్టర్ల భూ సేకరణలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి, వారు అంగీకరించిన తర్వాతే పనులు చేపడతామని చెప్పారు. సమస్యలేమైనా ఉంటే రైతులు అధికారుల ముందు వెల్లడించాలని శ్రీధర్ బాబు కోరారు. ప్రతిపక్షాల కుట్రలకు, రెచ్చగొట్టే చర్యలకు ప్రభుత్వం భయపడదని హెచ్చరించారు. పదేళ్ల కాలంలో తామెన్నడూ అధికారుల పైన దాడులకు ఉసిగొల్పే కుట్రలకు పాల్పడలేదని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూసే ఏ శక్తినీ ఉపేక్షించబోమని ఆయన పేర్కొన్నారు. మీడియా సమావేశంలో ఐటీ, పరిశ్రమల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, లైఫ్ సైన్సెస్ విభాగం డైరెక్టర్ శక్తి నాగప్పన్, టీజీఐఐసి సిఇఓ మధుసూదన్ పాల్గొన్నారు.





# ప్రశ్నించడం, నిలదీయడం విపక్షాల బాధ్యత..

- లీడర్ ఆఫ్ ది హౌస్, లీడర్ ఆఫ్ ది అపొజిషన్ కు సమాన అవకాశాలు
- స్పీకర్ సమన్వయంతో సభను నడపాలి
- నేటి ప్రతిపక్షం సభను వాయిదా కే చూస్తోంది..
- చిల్డ్రన్ మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో సీఎం రేవంత్

**జనపదం, హైదరాబాద్:** ప్రభుత్వాలు అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు, చేపడుతోన్న అభివృద్ధిలో లోపాలు, గాడితప్పిన పాలన గురించి అసెంబ్లీలో ప్రశ్నించడం, ప్రభుత్వాన్ని నిలదీయడం విపక్షాల బాధ్యత అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర అసెంబ్లీలో లీడర్ ఆఫ్ ది హౌస్, లీడర్ ఆఫ్ ది అపొజిషన్ ఇద్దరికీ సమాన అవకాశాలు ఉంటాయన్న ఆయన సభను సమర్ధవంతంగా నడిపే బాధ్యత స్పీకర్ పై ఉంటుందన్నారు. గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని ఎస్సీఈఆర్టీ(స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) కార్యాలయ ప్రాంగణంలో 'విద్యార్థులు అండర్-18 మాక్ అసెంబ్లీ' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మాక్ అసెంబ్లీ వంటి సమావేశాలు సమాజానికి చాలా అవసరమని తెలిపారు. శాసన సభలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలు, సమాధానాలు, ఇతర అంశాలను విద్యార్థులు గమనించాలని సూచించారు. విపక్షాలు ఆందోళన చేసినా ప్రభుత్వం సమన్వయంతో సభను నడిపించేలా చూడాలనీ కానీ దురదృష్టవశాత్తు ఈ రోజుల్లో కొందరు సభను ఎలా వాయిదా వేయాలా అనేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిల్డ్రన్ మాక్ అసెంబ్లీని స్ఫూర్తిదాయకంగా నిర్వహించిన మీ అందరినీ అభినందిస్తున్నానన్నారు. జవహర్ లాల్ నెహ్రూ ఎడ్యుకేషన్, అగ్రికల్చర్ రెవల్యూషన్ తీసుకొచ్చారనీ ఆయనతోనే మనకు సమాజంలో అవకాశాలు వచ్చాయి. దేశంలో నిర్బంధ విద్య అమలు చేసేందుకు సోనియా గాంధీ, మన్మోహన్ ఎంతో కృషి చేశారని చెప్పారు.

# లగచర్ల భూములు ముట్టుకుంటే ఊరుకోం

- హైడ్రా పేరుతో బుల్డోజర్ల పాలన నడిపిస్తున్నారు
- ప్రజలకు ఇచ్చిన హామీలు మరిచి పోయారు
- కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే దూకుడుగా పని చేస్తున్నారు
- విప్లవకారులపై ఫాసిస్ట్ దాడులు
- మావోయిస్టు పార్టీ లేఖ
- సీఎం రేవంత్, ప్రభుత్వానికి వార్నింగ్



**జనపదం, బ్యూరో:** సీఎం రేవంత్ రెడ్డికి మావోయిస్టులు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. లగచర్ల ఘటనతోపాటు హైడ్రా తదితర అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలు ఆపాలని హెచ్చరించారు. మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో గురువారం రిలీజైన లేఖ సంచలనం రేపుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం గడిచిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం దూకుడుగా పని చేస్తుందన్నారు. పౌర ప్రాధమిక హక్కులను, జీవించే హక్కును కాలరాస్తుందని, రాష్ట్రాన్ని కార్పోరేట్లకు కట్టపెట్టడానికి ఆర్థిక అభివృద్ధి పేరుతో సులభతర వాణిజ్య విధానం అమలు చేస్తూ కార్పోరేట్ సంస్థల విస్తృత పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారన్నారు. హైదరాబాద్ ను ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) చేయడానికే ప్రపంచ స్థాయి హైదరాబాద్ (గ్లోబల్ హైదరాబాద్) నిర్మించే పేరుతో మూసీ నది సుందరీకరణ, రివర్ బెడ్ ప్రక్షాళన, హైదరాబాద్ లో అక్రమ కట్టడాల పేర్లతో రివర్ బెల్ట్ డెవలప్ మెంట్స్ కార్పోరేషన్ లిమిటెడ్ (ఎంఆర్డిసిఎల్), కార్యచరణ విభాగం హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ ఇండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) ప్రత్యేక విభాగాలను ఏర్పరచి వాటికి విస్తృత అధికారాలను కట్టబెట్టి బుల్డోజర్ల పాలన కొనసాగిస్తున్నారని మావోయిస్టు పార్టీ మండిపడింది.

**అధికార మదంతో దౌర్జన్యం..**

మూసీ నదిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చారిత్రక కట్టడాలను నిర్మించడానికి దేశ, విదేశీ కార్పొరేట్ల వేల కోట్ల పెట్టుబడులను రేవంత్ ఆహ్వానించాడని, మూసీ నది ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు స్వేచ్ఛమైన తాగునీరు అందించడానికి పరిశుభ్రత చర్యలు చేపట్టడం లేదని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ రాసిన లేఖలో ప్రస్తావించారు. పరిశ్రమల నుండి, నగరం నుండి వెలుపడుతున్న వ్యర్థాలు, అనేక వ్యర్థ పదార్థాల నుండి ఏర్పడుతున్న కాలుష్యం, మురికి నీరు మూసీ నదిలో చేరుతున్నాయని, వాటి నివారణ చర్యలు, నీటి శుద్ధి చేయకుండా వీటిన్నింటికి కారణం కేవలం మూసి పరివాహక ప్రాంత ప్రజలను బాధితులను చేస్తున్నారన్నారు. హైదరాబాద్ నగరంలో అక్రమ కట్టడాల పేరుతో అక్రమంగా నిర్మించిన ఐడా, బడా వ్యక్తుల, సంస్థల పెద్ద, పెద్ద అంతస్తులను వదిలేసి ప్రభుత్వాలు ఇచ్చిన అన్ని రకాల అనుమతులతో నిర్మించుకుని దశాబ్దాలుగా నివాసం వుంటున్న మధ్య తరగతి, పేద ప్రజలను అక్రమదారులుగా ప్రకటించారని ఆరోపించారు. న్యాయ పరమైన అనుమతులు పక్కన పెట్టి, ప్రజలకు ఎలాంటి ముందుస్తు సమాచారం గాని, నోటీస్ లు గాని ఇవ్వకుండా అధికార మదంతో దౌర్జన్యంతో, ఆకస్మికంగా రాత్రికి రాత్రి వచ్చి బుల్డోజర్లతో కష్టజీవులు నిర్మించుకున్న నివాసాలను కూల్చేసి సాధారణ ప్రజలు జీవించే హక్కును హరించి వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రిజర్వు ఫారెస్టును ఎందుకు ధ్వంసం చేస్తున్నారు**

వికరాబాద్ జిల్లా పూడూర్ మండలం దామగుండంలో విఎల్ఎఫ్ (వెరీ లో ఫ్రీక్వెన్సీ) కమ్యూనికేషన్ ట్రాన్స్ మిషన్(నేవీ రాడార్) స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు కల్పించిందని లేఖలో వివరించారు. దామగుండంలో నేవి రాడర్ స్టేషన్ నిర్మాణం కోసం రిజర్వ ఫారెస్టు 2900 ఎకరాల భూమిని అప్పగించారని, దీనితో సహజ సిద్ధమైన అనంతగిరికొండలున్న రిజర్వు ఫారెస్టు ధ్వంసం అవుతుందన్నారు. అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది మంది జీవించే హక్కును కోల్పోతున్నారని, కొడంగల్ నియోజవర్గం దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో పార్మసిటిని నిర్మించి ప్రాకృతిక వనరులతో పాటు రైతుల పంట భూములను కొల్లగొట్టడానికి పథకం పన్నారని మండిపడ్డారు. భూములు కొల్పుతున్న రైతులు జీవన, మరణ పోరాటంలో లగచర్ల గ్రామ ప్రజలు మిలిటెంట్ ఉద్యమం చేపట్టారని, ప్రజలు న్యాయమైన పోరాటాన్ని వక్రీకరించి రైతులపై కేసులు పెట్టి బనాయించారని లేఖలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఫాసిస్టు దాడులు..**

అదిలాబాద్ జిల్లాలో ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమ బాట పట్టారని, ప్రజోద్యమాన్ని అణిచివేయడానికి ఆ ఉద్యమానికి నాయకత్వం వహించిన ఉపాధ్యాయున్ని విధుల నుండి సస్పెండ్ చేశారని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ లేఖలో పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలిచి ప్రజాస్వామ్య బద్ధంగా ప్రశ్నించే వారి గొంతు నొక్కుతున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రాహ్మణీయ హిందుత్వ కేంద్ర ప్రభుత్వం అంటకాగుతూ మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంలో విప్లవ కారులపై ఫాసిస్టు దాడులకు పూనుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, గుండాల మండలం దామెరతోగు గ్రామాల వద్ద వందలాది బలగాలను మోహరించి కా.నల్లమారి అశోక్ ను, ఇదే జిల్లాలో కరకగూడెం మండలం రఘునాథ పాలెం గ్రామం వద్ద ఆరుగురి విప్లవకారులను పాశవికంగా హత్యలు చేశారని ఆరోపించారు.

**అంతా కార్పొరేట్ల లాభాల కోసమే..**

రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసం, అప్రజాస్వామిక పాలన కేవలం ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లనో, బాధ్యత రాహిత్యం వల్లనో జరుగుతున్నది కాదని, ఉద్దేశ పూర్వకంగా కార్పోరేట్ల లాభాల కోసం కొమ్ముకాస్తూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వారి నమ్మిన బంటునని నిరూపించుకోవడానికి అత్యుత్సాహం పదర్శిస్తున్నాడని మావోయిస్టు పార్టీ మండిపడింది. కార్పొరేట్ల పెట్టుబడులలో వాటా, పెద్ద మొత్తంలో కమీషన్లను సీఎం రేవంత్ రెడ్డి పొందుతున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పోరేట్ల అనుకూల, ప్రజావ్యతిరేక అప్రజాస్వామిక పాశవిక పాలనను ప్రతి ఒక్కరూ ఖండించాలని, అక్రమ కట్టడాలు, మూసినది ప్రక్షాళన పేర్లతో మధ్యతరగతి, పేద ప్రజలపై హైడ్రా కొనసాగిస్తున్న అనాగరిక బుల్డోజర్ దాడులను వ్యతిరేకించాలని, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్న నేవి రాడర్ స్టేషన్ ను, పార్మాసిటిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ విరోచితంగా మిలిటెంట్ ఉద్యమాలు చేపట్టాలని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ లేఖలో పిలుపునిచ్చారు.

# సాగుతున్న సర్వే

- ఫ్రిజ్లు, ఏసీలు, కార్లు ఉన్న వారికి భయం
- సంక్షేమ పథకాలు కట్ చేయం
- సర్వే పూర్తి చేసి తీరుతాం
- ప్రతి ఒక్కరి సమాచారం గోప్యం
- బ్యాంకు అకౌంట్ డీటెల్స్ అడుగడం లేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్



**జనపదం, బ్యూరో:** రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే అంతా ఆగమాగమవుతున్నది. ఈ సందర్భంగా –గురువారం సర్వే తీరును మంత్రి పొన్నం పరిశీలించారు. జీహెచ్ఎంసీ మేయర్ ఇంటికి వెళ్లి సర్వే స్థితిని తెలుసుకున్న మంత్రి పొన్నం – ఆస్తుల వివరాలు వెల్లడిస్తే ప్రభుత్వ పథకాలు ఆగిపోవని భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 6 నుంచి ఇళ్ల గుర్తింపు కార్యక్రమం, అలాగే 9వ తేదీ నుంచి ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైంది. సర్వే మొత్తం సాఫీగానే సాగుతోంది. కానీ హైదరాబాద్లో అక్కడక్కడ సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లను యజమానులు దూషించడం, వివరాలు ఇవ్వడం జరగదు అని చెబుతున్న కొన్ని ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ క్రమంలోనే సర్వేలో ఫ్రిజ్లు, టీవీలు, ఏసీలు, కారు, ద్విచక్ర వాహనం ఇలా అన్ని వివరాలు వెల్లడిస్తే ప్రస్తుతం వస్తున్న ప్రభుత్వ పథకాలు ఆగిపోతాయని కొందరు సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇప్పుడు ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ క్లారిటీ ఇచ్చారు. హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఇంట్లో జరుగుతున్న సర్వేను పర్యవేక్షించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు.

**అంతా గోప్యం**

సర్వే సమాచారం గోప్యంగా రాష్ట్ర ప్రభుత్వమే సేకరిస్తుందని, ఈ సమాచారం సేకరించడంతో ఎవరికీ కూడా ఏ ప్రభుత్వ పథకాలు నిలిచిపోవని, ఇంకా అదనంగా పథకాలు ఇవ్వడానికి సేకరిస్తున్న సమాచారాన్ని ఉపయోగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. దీన్ని రహస్యంగా ఏదో దాచిపెట్టేది కాదని, దీనిపై అనేక రకాలుగా అనేక వేదికలపైన చర్చ చేసి భవిష్యత్తులో ప్రజలకు ఉపయోగపడే విధంగా, పారదర్శకంగా ప్రభుత్వం సమాచారం సేకరిస్తుందన్నారు. ఈ సర్వేకు రాజకీయాలతో సంబంధం లేదని, కేబినెట్ తీర్మానం తర్వాత శాసనసభలో ఆమోదించిన తర్వాత సర్వే చేస్తున్నామని, ఎన్యూమరేటర్లపై దూషణలకు దిగితే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తేల్చి చెప్పారు. ప్రజలను భాగస్వాములను చేసుకుని ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే జరుగుతోందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ సర్వేతో తెలంగాణ దేశానికే దిక్సూచిగా ఉండే విధంగా జరుగుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 30 శాతం సర్వే జరగ్గా, జీహెచ్ఎంసీ పరిధిలో 4.50 లక్షల ఇళ్లకు సర్వే పూర్తి అయిందని తెలిపారు. రాష్ట్రంలో 85 వేల పైగా ఎన్యూమరేటర్లు సర్వే చేస్తున్నారని చెప్పారు. ప్రధానమంత్రినే స్పందించే విధంగా ఈ కార్యక్రమం జరుగుతుందని ఆనందించారు.

**బ్యాంక్ అకౌంట్ డీటైల్స్ అడగం**

ప్రజల బ్యాంక్ అకౌంట్ డీటైల్స్ అడగడం లేదని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా ఉందా లేదా అని సమాచారం మాత్రమే అడుగుతున్నారని, బ్యాంక్ ఖాతాకు ఆప్షన్ అడుగుతున్నామని, ఆధార్ కార్డు తప్పనిసరి కాదన్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం ద్వారా తెలంగాణ ప్రజలకు న్యాయం జరుగుతుందని, దయచేసి అందరూ సహకరించాలని కోరారు. గతంలో సర్వే చేయాలని అనేక దీక్షలు, ధర్నాలు చేసిన వారు సైలెంట్గా ఉన్నారని, అందరూ సర్వేను స్వాగతిస్తున్నారని, ప్రైవేటు వ్యక్తులు ఎవరూ లేరని, ఐడెంటీ కార్డు ఉంటుందన్నారు. వాళ్లు ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నారని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు ఉంటాయని మంత్రి పొన్నం హెచ్చరించారు.

**ఆ ఒక్కటి అడక్కండి**

ఇక, సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు ప్రజల నుంచి మిశ్రమ స్పందన – పట్టణాల్లో ఒకరకంగా, గ్రామీణ ప్రాంతాల్లో మరోరకంగా కొనసాగుతున్నది. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 కుటుంబాలు కేటాయించినా సర్వే సమయంలో వాటి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. ఉదాహరణకు ఒక కుటుంబంలోని వివరాలు ఒకే ఫాంలో నమోదు చేస్తుంటే పెళ్లిళ్ల అయిన కుమారులు వేరుగా వివరాలు నమోదు చేయించుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అద్దెకు ఉంటున్నవారు సైతం వివరాలు రాయించుకోవడంతో కుటుంబాల సంఖ్య క్రమంగా పెరుగుతోందని ఎన్యుమరేటర్లు అంటున్నారు. సమగ్ర కుటుంబ సర్వే సాఫీగా సాగుతోందని, ప్రజలు కుటుంబ వివరాలన్నీ చెబుతున్నారని కొత్తగూడెంలోని ఓ ఎన్యుమరేటర్ తెలిపారు. ఇప్పటివరకు జరిగిన సర్వేలో ఒకట్రెండు కుటుంబాలు మాత్రమే తమకు సర్వే అవసరం లేదని అన్నారని చెప్పారు. దాదాపు 90 శాతం కుటుంబాలు తమ ఆస్తుల వివరాలు మాత్రం చెప్పటం లేదని వివరించారు. పట్టణాల్లో సర్వే ఇబ్బందిగా ఉంటోందని, తమ వివరాలు చెప్పేందుకు కొన్ని కుటుంబాలు నిరాకరిస్తున్నాయని సత్తుపల్లిలో ఓ ఎన్యుమరేటర్ తెలిపారు. సర్వేకు సహకరించినా అన్ని ప్రశ్నలకు వివరాలివ్వటం లేదని చెప్పారు. ఆస్తుల విషయంలో అయితే అవి మీకెందుకు అనే సమాధానమే ఎదురవుతోందని పేర్కొన్నారు. కొంతమంది అయితే సర్వే ఎందుకు ? మా వివరాలు మీకెందుకు అంటూ ప్రశ్నలతోనే సమయం వృథా చేస్తున్నారని తెలిపారు.



Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com